





ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 193 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
సోమవారం 17 ఫిబ్రవరి 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# దిల్లీలో భూకంపం.. 'బూమ్' శబ్దం ఎందుకొచ్చింది..?

**దిల్లీలో భూకంపం వచ్చిన సమయంలో పెద్దగా 'బూమ్' శబ్దం వచ్చింది. అది ఎందుకు వచ్చిందంటే..?**

దిల్లీ, ఫిబ్రవరి 17, (రిపబ్లిక్ న్యూస్): దేశ రాజధాని దిల్లీ పరిసర ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామున భూకంపం సంభవించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దిల్లీ, నోయిడా, గురుగ్రామ్ ప్రాంతాల్లో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. రిక్టర్ స్కేల్పై దీని తీవ్రత 4.0గా నమోదైంది. ధౌలా కాన్లోని దుర్గాబాయ్ దేశముఖ్ కాలేజీ సమీపంలో 5 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రకంపనలు సంభవించిన సమయంలో కొన్ని సెకన్ల పాటు పెద్ద శబ్దం వినిపించింది. అసలు ఆ శబ్దానికి గల కారణాలను నిపుణులు వెల్లడించారు. తక్కువ లోతున ఉండే భూకంప కేంద్రం ఏర్పడినప్పుడు ప్రకంపన సమయంలో ఈ బూమింగ్ శబ్దాలు వినిపిస్తుంటాయి. ఆ సమయంలో భూమి పై ప్రకంపనలు రావడంతోపాటు, స్వల్పకాలం వచ్చిన భూతరంగాలు గాలిలో కలిసి ధ్వని తరంగాలుగా ఏర్పడతాయని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది.

అధిక ఫ్రీక్వెన్సీ కంపనాల కారణంగా 'బూమ్' శబ్దం వస్తుందని పేర్కొంది. కొన్నిసార్లు కంపనాలు జరగకపోయినప్పటికీ.. ఈ భారీ శబ్దాలు వెలువడేందుకు అవకాశం ఉంది. భూమి ఉపరితలం నుంచి 70 కి.మీ. లోతులో ఉంటే షాలో ఫోకస్ ఎర్త్క్వేక్స్ గా పరిగణిస్తారు. కేంద్రం లోతు ఎంత తక్కువగా ఉంటే.. అంత ఎక్కువగా శబ్దాలు వినిపిస్తాయి. ఈరోజు దిల్లీ, బిహార్ లో వచ్చిన ప్రకంపనల్లో భూకంప కేంద్రాలు 5 కి.మీ నుంచి 10 కి.మీ లోతులోనే ఉన్నాయి. దిల్లీ సీస్మిక్ జోన్ 4లో ఉంది. దేశాన్ని నాలుగు భూకంప మండలాలుగా విభజించారు. మండలం-2 అనేది 4.9 కన్నా తక్కువ తీవ్రత ఉండే ప్రాంతం. దేశ భూభాగంలో ఇది 40.93 శాతం. కర్ణాటక పీఠభూమి, ద్వీపకల్ప ప్రాంతాలు ఇందులో ఉన్నాయి. మూడో మండలం 5-5.9 తీవ్రతను కలిగిఉంటుంది. ఇది దేశ విస్తీర్ణంలో 30.79 శాతం. పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలతో పాటు కేరళ, గోవా, లక్షద్వీప్ దీవులు ఇందులో ఉన్నాయి. భూకంప మండలం-4లో అధికస్థాయి భూకంపాలు (6- 6.9) వస్తాయి. దేశంలో 17.49శాతం భూభాగం ఇటువంటిదే. ఇందులో జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, దిల్లీ, సిక్కిం, ఉత్తరప్రదేశ్లోని ఉత్తర ప్రాంతాలు, బిహార్, పశ్చిమ్ బెంగాల్, మహారాష్ట్ర పశ్చిమ తీరం, రాజస్థాన్లు ఉన్నాయి. మండలం-5 లో 7కన్నా ఎక్కువ తీవ్రమైన భూకంపాలు సంభవిస్తాయి. 10.79శాతం భూభాగంలో ఇలాంటివి చోటుచేసుకునే ప్రమాదముంది. దీని పరిధిలో ఉత్తర బిహార్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్లోని రాన్-ఆఫ్-కచ్, అండమాన్-నికోబార్ దీవులున్నాయి.



అందుకే హిమాలయాల్లో భూకంపాలు ఎక్కువ..

సహజంగా శక్తి విడుదలైనప్పుడు భూమి కంపిస్తుంది. ఆ సమయంలో భూకంప కేంద్రం నుంచి అన్ని దిశల్లోనూ తరంగాలు ప్రయాణిస్తాయి. భూఫలకలు మానవ స్పర్శకు తెలియని స్థాయిలో నిరంతరం కదులుతూనే ఉంటాయి. అయితే, ఆ సమయంలో భూపొరలు బలహీనంగా ఉన్నచోట్ల ఒక్కోసారి కంపనాలు సంభవిస్తాయి. భూఫలకల అంచుల చుట్టూ తరచూ భూకంపాలు చోటుచేసుకుంటాయి. ఉదాహరణకు, భారతదేశ భూఫలక ఉత్తర దిశగా, ఈశాన్యం వైపు కదులుతూ ఉంటుంది. ఈ ఫలక సంవత్సరానికి 5 సెం. మీ. చొప్పున కదులుతుంది. భారతదేశానికి పైభాగంలో ఉన్న యురేషియన్ భూఫలక ఉత్తర దిశగా ఏడాదికి 2 సెం.మీ. చొప్పున కదులుతోంది. ఈ రెండు ఫలకల కదలికల్లో తేడాలు ఉండటం వల్ల భారత భూఫలక యురేషియన్ ఫలకను ఢీకొడుతోంది. అందుకే హిమాలయాల ప్రాంతాల్లో తీవ్ర భూకంపాలు వస్తున్నాయి. దిల్లీలో మళ్లీ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచించిన సంగతి తెలిసిందే. భద్రతా చర్యలు పాటించాలని కోరారు. భూవిజ్ఞాన శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా ప్రజలను అప్రమత్తం చేశారు. జాగ్రత్తలు పాటిస్తూ సంసిద్ధంగా ఉండాలని కోరారు. ఎప్పటికప్పుడు వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

## మళ్లీ భూప్రకంపనలు వచ్చే అవకాశం.. అప్రమత్తంగా ఉండాలన్న ప్రధాని మోదీ

సోమవారం తెల్లవారుజామున దేశ రాజధాని దిల్లీ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో సంభవించిన స్వల్ప భూప్రకంపనలపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు.

దిల్లీ, ఫిబ్రవరి 17, (రిపబ్లిక్ న్యూస్): దేశ రాజధాని దిల్లీ పరిసర ప్రాంతాల్లో సోమవారం భూకంపం సంభవించింది. తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ప్రకంపనలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు.



మళ్లీ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దిల్లీ, నోయిడా, గురుగ్రామ్ ప్రాంతాల్లో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. రిక్టర్ స్కేల్పై దీని తీవ్రత 4.0గా నమోదైంది. ధౌలా కాన్లోని దుర్గాబాయ్ దేశ-ముఖ్ కాలేజీ సమీపంలో 5 కిలోమీటర్ల భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రకంపనలు సంభవించిన సమ-యంలో భారీ శబ్దం వినిపించడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. దీనిపై ప్రధాని ఎక్స్ వేదికగా స్పందించారు. "దిల్లీ, పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి. భద్రతా చర్యలు పాటించాలి. మళ్లీ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. పరిస్థితులను అధికారులు సునిశితంగా పరిశీలిస్తున్నారు" అని ప్రధాని మోదీ వెల్లడించారు.

## కూలీలతో వెళ్తున్న ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ముగ్గురి మృతి

గుంటూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది.





నారాకోడూరు, ఫిబ్రవరి 17, (రిపబ్లిక్ న్యూస్): గుంటూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. నారాకోడూరు-బుడంపాడు గ్రామాల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల్లో అరుణకుమారి, నాంచారమ్మ, సీతారావమ్మ ఉన్నారు. వీరిది చేబ్రోలు మండలం సుద్దపల్లి. తీవ్రంగా గాయపడిన మహిళను గుంటూరు జీజీహెచ్కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

## కుంభమేళాలో మంత్రి నారా లోకేశ్ దంపతులు.. కుమారుడితో సెల్ఫీ!

**ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రయాగ్‌రాజ్‌లో పర్యటించారు. మహా కుంభమేళాలో తన సతీమణితో కలిసి పుణ్యస్నానం ఆచరించారు.**

ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 17, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ మంత్రి నారా లోకేశ్ ఉత్తరప్రదేశ్లోని ప్రయాగ్‌రాజ్‌లో పర్యటించారు. మహా కుంభమేళాలో తన సతీమణితో కలిసి పుణ్యస్నానం ఆచరించారు. నిజమైన ఆశీర్వచనం లభించిందంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.



ఈ సందర్భంగా తన తనయుడు నారా దేవాంశ్తో కలిసి కుంభమేళాలో దిగిన సెల్ఫీని షేర్ చేసుకున్నారు. మరోవైపు, ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న కుంభమేళాకు సామాన్యభక్తులతో పాటు ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆదివారం ఒక్కరోజే సాయంత్రం 6 గంటల వరకు 1.36కోట్ల మంది భక్తులు ప్రయాగ్రాజ్కు వచ్చినట్లు యూపీ ప్రభుత్వం వెల్లడించింది. దీంతో నిన్నటివరకు మొత్తంగా 52.83కోట్ల మంది కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు తెలిపింది.

## 'కోడ్' అమలులో లేని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులివ్వండి.. సీఎం రేవంత్ ఆదేశం

**కొత్త రేషన్ కార్డుల జారీకి వెంటనే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

హైదరాబాద్, ఫిబ్రవరి 17, (రిపబ్లిక్ న్యూస్): కొత్త రేషన్ కార్డుల జారీకి వెంటనే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ అధికారులతో జరిపిన సమీక్షలో కీలక ఆదేశాలు జారీ చేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున.. ఈ కోడ్ అమలులో లేని జిల్లాల్లో వెంటనే రేషన్ కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కొత్త కార్డులకు సంబంధించి పలు డిజైన్లను సీఎం పరిశీలించారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొత్త వారితో పాటు కార్డులు ఉన్నవారు సైతం కొత్తగా సభ్యులను చేర్చేందుకు దరఖాస్తులు చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు.

## దళితుడిని బెదిరించినందునే వల్లభనేని వంశీ అరెస్టు: మంత్రి డీబీవీ స్వామి

**మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దళితుడిని బెదిరించినందునే అతడిని పోలీసులు అరెస్ట్ చేశారని ఏపీ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి (డీబీవీ స్వామి) అన్నారు.**

అమరావతి, ఫిబ్రవరి 17, (రిపబ్లిక్ న్యూస్): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దళితుడిని బెదిరించినందునే అతడిని పోలీసులు అరెస్ట్ చేశారని ఏపీ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి (డీబీవీ స్వామి) అన్నారు. ఇప్పుడు అమలవుతోంది అసలైన రాజ్యాంగమని చెప్పారు. అమరావతిలో మీడియాతో ఆయన మాట్లాడారు. వంశీ తప్పు చేసినందునే పోలీసులు అరెస్టు చేశారన్నారు.

వేధించాలంటే కూటమి ప్రభుత్వానికి ఎనిమిది నెలల కాలం అవసరం లేదని మంత్రి వ్యాఖ్యానించారు. జగన్ హయాంలో తనతో సహా అందరిపైనా వందలాది అక్రమ కేసులు పెట్టారని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛను రూ.4 వేలు చేసిందని గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వానికి రూ.వెయ్యి పెంచడానికి ఐదేళ్లు పట్టిందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు మొదటి ఏడాదిలోనే అమలు చేయబోతున్నట్లు స్పష్టంచేశారు. జగన్ హయాంలో చేసిన అప్పులను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా తీరుస్తోందని మంత్రి డోలా చెప్పారు. రాష్ట్రం ప్రభుత్వం అభివృద్ధితో ముందుకెళుతోందని.. ప్రజలపై ఎక్కడా భారం మోపటం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఇప్పుడు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.




### అపోహలు వద్దు.. ఎవరినీ తొలగించడం లేదు

అంతకుముందు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాలతో మంత్రి సమవేశమయ్యారు. ఆ ఉద్యోగుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. పదోన్నతులు కల్పించాలని, పీఆర్సీ వేయాలని వినతులు వచ్చాయని మంత్రి తెలిపారు. ఎ, బి, సి కేటగిరీలుగా ఉద్యోగులను రేషనలైజేషన్ చేయాలని నిర్ణయించామని వివరించారు. సీనియర్ అధికారులతో కూడిన కమిటీని నియమించి సర్వీసు నిబంధనలు రూపొందిసామన్నారు. రేషనలైజేషన్ విషయం పైనా అధికారుల కమిటీ పరిశీలన చేస్తుందని తెలిపారు. ఈ ప్రక్రియతో కొంతమందిని తొలగిస్తారనే అపోహలను కొందరు సృష్టిస్తున్నారని.. ఎవరినీ తొలగించడం లేదని మంత్రి స్పష్టం చేశారు. కొన్ని శాఖల్లో చాలా ఖాళీలు ఉన్నాయన్నారు. మహిళా పోలీసుల విషయంలోనూ మహిళా శిశు సంక్షేమశాఖ, హోంశాఖలను సంప్రదించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## ఉచితంగా పనిచేస్తా.. ఉద్యోగం ఇవ్వండి చాలు: ఓ టెకీ పోస్టు వైరల్

ఉద్యోగం లేక తీవ్ర నిరాశకు గురైన ఓ టెకీ చేసిన పోస్టు నెట్టింట్‌లో వైరల్‌గా మారింది.




బెంగళూరు, ఫిబ్రవరి 17, (రిపబ్లిక్ న్యూస్): చదువుపూర్తయి రెండేళ్లయినా ఉద్యోగం దొరక్క ఓ టెక్ గ్రాడ్యుయేట్ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అనుభవం లేదంటూ ఎదుర్కొన్న తిరస్కరణలతో కొత్త ఆలోచన చేశారు. దానినే ఎక్స్ వేదికగా షేర్ చేశారు.

ఇప్పుడు ఆ పోస్టు నెట్టింట్లో వైరల్ మారింది. నిరుద్యోగంతో నిరాశ చెందిన ఓ బెంగళూరు గ్రాడ్యుయేట్ తన రెజ్యూమేను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. "2023లో ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ లో బీఈ పూర్తి చేశాను. ప్రస్తుతం ఉద్యోగాన్ని సాధించడంలో సవాళ్లు ఎదుర్కొంటున్నాను. నా రెజ్యూమేను పక్కనపడేసినా పర్లేదు కానీ నాకు సహాయం చేయండి. ఉచితంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని వెల్లడించారు. జావా, పైథాన్, క్లౌడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్ తదితర కోర్సుల్లో తనకు ప్రావీణ్యం ఉందన్నారు. ఇలా పనిచేయడం వల్ల కనీసం అనుభవమైనా వస్తుందని ఆ టెకీ యోచన. ఈ పోస్టుపై పలువురు స్పందించారు. కొందరు సలహాలు, సూచనలు చేశారు. సీవీని మరింత మెరుగ్గా సిద్ధం చేసుకోమని సూచించారు.

## తితిదే అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.11కోట్ల విరాళం

**తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు సోమవారం భారీ విరాళం అందింది.**

తిరుమల, ఫిబ్రవరి 17, (రిపబ్లిక్ న్యూస్): తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు సోమవారం భారీ విరాళం అందింది. ముంబయిలోని ప్రసిద్ యునో ఫ్యామిలీ ట్రస్టుకు చెందిన తుషార్ కుమార్ అనే భక్తుడు రూ.11 కోట్ల విరాళం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన డీడీని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు. అన్నప్రసాదం ట్రస్టుకు భారీ విరాళం అందజేసిన భక్తుడు తుషార్ కుమార్ను ఆయన అభినందించారు.



## అందువల్లే సీఎం ప్రకటన జాప్యం.. భాజపాపై ఆతిశీ విమర్శలు

**ప్రభుత్వాన్ని నడిపేందుకు భాజపాలో సమర్థవంతమైన నాయకులు లేనందునే భాజపా నూతన ముఖ్యమంత్రిని ప్రకటించట్లేదని దిల్లీ ఆపద్ధర్మ సీఎం ఆతిశీ విమర్శలు గుప్పించారు.**

దిల్లీ, ఫిబ్రవరి 17, (రిపబ్లిక్ న్యూస్): దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి దాదాపు వారం రోజులవుతున్నా.. దిల్లీ ముఖ్యమంత్రి ఎవరనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. దిల్లీ నూతన సీఎం, మంత్రివర్గాన్ని ప్రకటించే విషయంలో జాప్యంపై దిల్లీ ఆపద్ధర్మ సీఎం ఆతిశీ భాజపాను ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టి.. ప్రభుత్వాన్ని నడిపే సామర్థ్యంగల నేతలు ఎవరూ లేనందున భాజపా ఇంకా అభ్యర్థిని ప్రకటించట్లేదని దుయ్యబట్టారు.



ఎన్నికల్లో గెలుపొందిన 48 మంది భాజపా ఎమ్మెల్యేల్లో ఒకరిపైన కూడా ప్రధాని మోదీకి నమ్మకం. లేదని.. అందుకే నూతన సీఎంను ప్రకటించడానికి వెనుకడుగు వేస్తున్నారని అన్నారు. దేశ రాజధానిలో ప్రభుత్వాన్ని నడిపే సత్తా లేనివారు ప్రజల అభివృద్ధికి ఎలా పని చేస్తారని ప్రశ్నించారు. 20న దిల్లీ నూతన సీఎం ప్రమాణస్వీకారం.. దిల్లీ ముఖ్యమంత్రి ఎవరనే విషయంపై భాజపా ఇంకా స్పష్టత ఇవ్వనప్పటికీ.. ఫిబ్రవరి 20న కొత్త ప్రభుత్వం కొలువు తీరనుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కార్యక్రమానికి జవహర్లాల్ నెహ్రూ స్టేడియం వేదిక కానున్నట్లు సమాచారం. గురువారం సాయంత్రం 4.30 గంటలకు నూతన సీఎం, మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల్లో గెలుపొందిన 48 మంది ఎమ్మెల్యేలలో 15మంది పేర్లతో ఇప్పటికే భాజపా ఒక జాబితా రూపొందించిందని.. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దిల్లీ భాజపా నేతలతో చర్చించి..త్వరలో కొత్త సీఎంను ప్రకటిస్తారని పార్టీ జాతీయ కార్యదర్శి మనిందర్ సింగ్ సిర్సా తెలిపారు. ఫిబ్రవరి 5న దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. 8వ తేదీన ఫలితాలు వెల్లడయ్యాయి. ఇందులో ఘన విజయం సాధించిన భాజపా.. 70 స్థానాలకు 48 చోట్ల గెలుపొంది 27 ఏళ్ల తర్వాత అధికారం చేపట్టేందుకు సిద్ధమైంది. అయితే, ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనే విషయంపై ఎటువంటి ప్రకటన వెలువర్చలేదు. ముఖ్యమంత్రి అభ్యర్థి రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నా.. మాజీ సీఎం కేజీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. అశీశ్ సూద్, రేఖా గుప్తాల పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ఉండనున్నట్లు సమాచారం.

## వివాహ వేడుకలో పూలదండలు, ఉంగరాలు మార్చుకున్న కేసీఆర్ దంపతులు

వివాహ విందుకు హాజరైన కేసీఆర్ దంపతులు.. అతిథుల సమక్షంలో ఒకరికొకరు పూల దండలు, ఉంగరాలు మార్చుకున్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 17, (రిపబ్లిక్ న్యూస్): వివాహ విందుకు హాజరైన కేసీఆర్ దంపతులు.. అతిథుల సమక్షంలో ఒకరికొకరు పూల దండలు, ఉంగరాలు మార్చుకున్నారు. ఈ అపురూప సన్నివేశం సిద్దిపేట జిల్లాలో గజ్వేల్లో సోమవారం జరిగింది. ఓ వివాహ వేడుకకు కేసీఆర్.. సతీమణి శోభతో కలిసి అతిథిగా హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఇదే రోజు కేసీఆర్ పుట్టినరోజు కావడంతో కల్యాణ వేదిక వద్దే అప్పటికప్పుడు వేడుకకు పెళ్లివారు ఏర్పాట్లు చేశారు. పెళ్లికి వచ్చిన అతిథుల శుభాకాంక్షల మధ్య.. కేసీఆర్ దంపతులు పూల దండలు, ఉంగరాలు మార్చుకున్నారు.




printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1954: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖ-రరావు జననం. (చిత్రంలో)
- 1963: అమెరికన్ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు మైఖేల్ జెఫ్రీ జోర్డాన్ జననం.
- 1981: అమెరికాకు చెందిన ప్రసార మాధ్యమాల ప్రముఖురాలు, మోడల్, గాయని, రచయిత్రి, ఫ్యాషన్ డిజైనర్ మరియు నటి ప్యారిస్ హిల్టన్ జననం.
- 1984: భారతీయ సినిమా నటీమణి సదా జననం.
- 1986: తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి మరణం (జ.1895).
- 1987: రాజకీయ కార్టూనిస్టు అసీమ్ త్రివేది జననం.
- 2000: మైక్రోసాఫ్ట్ సంస్థ కంప్యూటర్ ఆపరేటింగ్ సాఫ్ట్‌వేర్ విండోస్ 2000ను విడుదల చేసింది


కల్వకుంట్ల చంద్రశేఖరరావు



మైఖేల్ జెఫ్రీ జోర్డాన్


ప్యారిస్ హిల్టన్


సదా


జిడ్డు కృష్ణమూర్తి


అసీమ్ త్రివేది



మైక్రోసాఫ్ట్ సంస్థ

# అలియా ఘనత.. అత్యంత ప్రభావవంతమైన నటిగా గుర్తింపు

బాలీవుడ్ నటి అలియా భట్ అరుదైన ఘనతను సాధించారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన నటీమణుల జాబితాలో రెండో స్థానంలో నిలిచారు.



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియాభట్ మ-రోసారి ఘనతను సాధించారు. ఇన్స్టాలో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన నటీమణుల జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. ఇన్ఫ్లుయెన-్సర్ మార్కెటింగ్ ప్లాట్ఫామ్ హైప్ ఆడిటర్ తాజాగా విడుదల చేసిన నివేదికలో అలియా రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జెన్నిఫర్ లోపెజ్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలను వెనక్కినెట్టి అలియా టాప్ లో ఉండడం విశేషం. దీంతో అలియా సినీరంగంలో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు చెబుతున్నారు. సోషల్ మీడియాలో ఈ స్టార్ హీరోయిన్కు ఉన్న ఫాలోయింగ్ తెలిసిందే. ఇన్స్టాలో ఈ బ్యూటీని ఏకంగా 8 కోట్ల మందికి పైగా ఫాలో అవుతున్నారు. ఎప్పుడూ తన సినిమా విశేషాలతో పాటు వ్యక్తిగత విషయాలను కూడా అలియా అభిమానులతో పంచుకుంటుంటారు. ఫొటోషూట్లతో నిత్యం ఆకట్టుకుంటుంటారు. ఇక అలియా గతేడాది కూడా టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన '100 మోస్ట్ ఇన్ఫ్లుయెన్షియల్ పీపుల్ ఆఫ్ 2024' (ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు) జాబితాలో చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. చివరిసారి 'జిగ్రా'తో అలియా పలకరించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ చిత్రం మిశ్రమ ఫలితాలకు పరిమితమైంది. కొన్ని రోజులుగా ఈమెకు సంబంధించిన పలు వార్తలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ప్రభాస్- హనురాఘవపూడి కాంబినేషన్లో రానున్న సినిమాలో అలియా యువరాణి పాత్రలో మెరవనున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే టాలెంటెడ్ దర్శకుడు నాగ్ అశ్విన్ సినిమాలోనూ ఆమె నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## శివకార్తికేయన్ తాజా సినిమా.. టైటిల్ గ్లింప్స్ రిలీజ్

శివ కార్తికేయన్ కొత్త చిత్రం టైటిల్ గ్లింప్స్ విడుదలైంది. 'మదరాసి' అనే టైటిల్తో తో ఇది రానుంది.



ఇటీవలే 'అమరన్'తో సూపర్ హిట్ను తన ఖాతాలో వేసుకున్నారు హీరో శివకార్తికేయన్. ఇప్పుడీ హీరో మురుగదాస్ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు. నేడు శివకార్తికేయన్ పుట్టినరోజు సందర్భంగా ఆ సినిమా టైటిల్ను ప్రకటించారు. 'మదరాసి'గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు తెలుపుతూ వీడియోను రిలీజ్ చేశారు. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

# మహేష్‌తో సినిమా తీయాలనుంది : మనసులో మాట బయటపెట్టిన తమిళ దర్శకుడు

తనకు మహేశ్ బాబుతో సినిమా తీయాలనుందని తమిళ దర్శకుడు అశ్వత్ మారిముత్తు అన్నారు. దానికి గల కారణాన్ని వివరించారు.





ప్రదీప్ రంగనాథన్ నటించిన లవ్, రొమాంటిక్ ఎంటర్టైనర్ 'డ్రాగన్'. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. తెలుగులో ఈ సినిమాను 'రిటర్న్ ఆఫ్ డ్రాగన్' పేరుతో విడుదల చేస్తున్నారు. ఫిబ్రవరి 21న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈనేపథ్యంలో తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. అందులో దర్శకుడు మాట్లాడుతూ మహేశ్ బాబుతో సినిమా తీయాలనుందన్నారు. దానికి గల కారణాన్ని వివరించారు. "2020లో నా ట్విటర్ అకౌంట్కు ఎప్పుడూ లేనన్ని వ్యూస్ వచ్చాయి. ఏమైందో అర్థం కాలేదు. నేను దర్శకత్వం వహించిన 'ఓహ్ మై కడవులే' సినిమా బాగుందని మహేశ్ పోస్ట్ పెట్టారని అందుకే నా అకౌంట్ ఫేమస్ అయిందని తర్వాత తెలిసింది. ఆ ట్వీట్లో ఆయన నాపై ప్రశంసలు కురిపించారు. అది చాలా చిన్న సినిమా. రూ.3 కోట్లతో రూపొందించాం. మేము అడగకుండానే మహేశ్ ఈ సినిమా గురించి పోస్ట్ పెట్టారు. ఆ తర్వాత తెలుగు దర్శకులు, నటీనటులు ఎంతోమంది దాన్ని చూసి మా టీమ్ను అభినందించారు. అప్పటినుంచి మహేశ్ ఒక్క ఛాన్స్ ఇస్తే అతనితో సినిమా తీయాలని అనుకుంటున్నా" అని చెప్పారు.

### తెలుగు నేర్చుకొని మాట్లాడిన తమిళ హీరో..

ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్లో తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్ తెలుగులో మాట్లాడి అందరినీ ఆకట్టుకున్నారు. తెలుగు ఆడియన్స్కు తాను ఇచ్చే బహుమతి ఇదేనన్నారు. తెలుగులో 'రిటర్న్ ఆఫ్ డ్రాగన్' కథను వివరించారు. తనను ఆదరిస్తున్న తెలుగు ప్రజలకు హృదయపూర్వక ధన్యావాదాలు తెలిపారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ గా మారింది. ఈ ఈవెంట్లో తెలుగులో మాట్లాడటం కోసం తెలుగు నేర్చుకున్నట్లు ఆయన తెలిపారు. దీంతో ప్రదీప్పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

### నిర్మాత కామెంట్స్ వైరల్..

ఇక ఇదే ఈవెంట్లో నిర్మాత ఎస్కేఎన్ చేసిన వ్యాఖ్యలపై కొందరు విమర్శలు కురిపిస్తున్నారు. "మేము తెలుగు రాని అమ్మాయిలను అభిమానిస్తాం. ఎందుకంటే.. తెలుగువచ్చిన అమ్మాయిలను ప్రోత్సహిస్తే ఏమౌతుందో ఈమధ్యే తెలుసుకున్నాం. ఇకనుంచి తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించకూడదని నేను, దర్శకుడు సాయిరాజేశ్ నిర్ణయించుకున్నాం" అని అన్నారు. కాగా, ఈ వ్యాఖ్యలను కొందరు తప్పుపడుతున్నారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## వ్యక్తిగత చెఫ్ లేదు..

# డైట్ ఫుడ్ కోసం కోహ్లి ఏం చేశాడంటే?



ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్ ఇండియా ఇప్పటికే దుబాయ్కు చేరుకుంది. ప్రాక్టీస్ కూడా ముమ్మరం చేసింది. విరాట్, రోహిత్ తోపాటు ఇతర క్రికెటర్లూ నెట్స్లో ఎక్కువగా సాధన చేశారు. బీసీసీఐ పది ఆదేశాల మేరకు ఆటగాళ్ల కుటుంబ సభ్యులకు అనుమతి ఇవ్వలేదు. అలాగే వ్యక్తిగత చెఫ్ను పెట్టుకొనేందుకు వీల్లేకుండా పోయింది. జట్టుకు బోర్డు నుంచి ప్రత్యేకంగా ఓ చెఫ్ను కేటాయించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, డైట్ విషయంలో కఠినంగా ఉండే భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి తనకిష్టమైన ఆహారం కోసం ఓ మార్గం కనిపెట్టినట్లు తెలుస్తోంది. ఆదివారం ప్రాక్టీస్కు వచ్చిన కాసేపటికే.. వేదిక వద్దకు కోహ్లికి ఫుడ్ డెలివరీ అయింది. ప్యాకెట్ల రూపంలో ఉన్నవి బ్యాటర్కు అందాయి. ప్రత్యేకంగా చెఫ్ లేకపోవడంతో లోకల్ టీమ్ మేనేజర్కు చెప్పి తనకు కావాల్సిన వాటిని తెప్పించుకున్నాడు. ఎలా చేయాలి? ఎలా ఉండాలనే దాని గురించి పూర్తిగా వివరించినట్లు సమాచారం. దీంతో సదరు మేనేజర్ వెంటనే ప్రసిద్ధిగాంచిన ఫుడ్ పాయింట్ నుంచి ప్యాకెట్లను తెచ్చి కోహ్లికి అందించాడు. "ప్రాక్టీస్ సెషన్ అనంతరం కోహ్లి తినేందుకు కొన్ని ఆహార పొట్లాలను ఇచ్చారు. ఇతర క్రికెటర్లు తమ కిట్లను సర్దుకుంటూ ఉండగానే.. కోహ్లి మాత్రం అక్కడే తన భోజనం పూర్తి చేశాడు. ప్రయాణంలోనూ తినేందుకు మరికొన్ని బాక్సును దాచుకున్నాడు" అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.


## ఇంటి చిట్కాలు

# మునగ ఆకుల్ని రోజూ తీసుకుంటే ధమనుల్లో పేరుకుపోయిన ఫలకం కరిగి గుండెకి మంచిది, ఎలా తీసుకోవాలంటే

మునగాకు కొన్ని వేల సంవత్సరాల నుంచి వీటిని మనం వంటల్లో అనేక రకాలుగా వాడుతుంటాం. దీనిలోని గుణాల కారణంగా మనకి ఎన్నోసమస్యలు దూరమవుతాయి. దానికోసం ఎలా తీసుకోవాలి.. ఏయే సమస్యలు దూ-రమవుతాయో తెలుసుకోండి.

సాధారణంగా ఇళ్లలో మునగాక పప్పు, మునగాకు కారం, మునగపొడి .. ఇలా అనేక రకాలుగా మునగాకుల్ని వాడతాం. మునగాకుల్లో ఎన్నో అద్భుత గుణాలున్నాయి. మరీ ముఖ్యంగా ఆరోగ్యకరమైన యాంటీ ఆక్సిడెంట్స్, బయోయాక్టివ్ ప్లాంట్ కాంపౌండ్స్ కూడా ఉన్నాయి. వీటిని మనం ఏదో రకంగా తీసుకోవడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి.మునగలో విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ప్రోటీన్, విటమిన్ బి6, విటమిన్ సి, ఐరన్, రిబోఫ్లేవిన్ బి2, విటమిన్, ఎ, మెగ్నీషియంలు ఉన్నాయి. ఇన్ని పోషకాలున్న మునగాకుతో టీ చేసి తాగితే ఎన్నో సమస్యలు దూరమవుతాయి. అవేంటో తెలుసుకోండి.

### గుండె ఆరోగ్యం



మునగాకులోని గుణాల కారణంగా కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీంతో పాటు బ్లడ్ ప్రెజర్ కూడా తగ్గుతుంది. మునగలోని గుణాలు ధమనుల్లో పేరుకుపోయిన కొవ్వు ఫలకాలని కరిగేలా చేస్తుంది. ఈ కారణంగా గుండెకి రక్త సరఫరా సరిగా జరుగుతుంది. గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. కాబట్టి, రెగ్యులర్‌గా ఈ టీని తాగండి.



### బ్లడ్ షుగర్




మునగాకుల టీ తాగడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ రెగ్యులేట్ అవుతాయి. ఈ ఆకులు గ్లూకోజ్ లెవల్స్ని తగ్గిస్తాయి. కాబట్టి, షుగర్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. రెగ్యులర్ టీలు తాగే బదులు ఇలాంటి హెర్బల్ టీలు తాగడం వల్ల చాలా వరకూ సమస్య కంట్రోల్ ఉంటుంది.

### డీటాక్స్



మునగాకుల్ని టీ చేసి తాగితే బాడీలో పేరుకుపోయిన టాక్సిన్స్ బయటికి వెళ్లిపోతాయి. మునగాకుల్లో డీటాక్సీపై గుణాలు పుష్కలంగా ఉ నినాయి. ఇందులోని ఐరన్ బాడీకి కావాల్సిన ఐరన్ని అందిస్తుంది. కాబట్టి, రెగ్యులర్‌గా ఈ టీని తీసుకునే ప్రయత్నం చేయండి.

### జీర్ణ వ్యవస్థని కాపాడేందుకు



మునగాకుల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఈ ఆకులతో టీ చేసుకుని తాగడం వల్ల మలబద్ధకం, ఉబ్బరం, గ్యాస్ వంటి జీర్ణ సమస్యల్ని దూరం చేసి జీర్ణ వ్యవస్థని చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. ఈ ఆకులు ప్రేగు కదలికల్ని మెరుగ్గా చేసి మలబద్ధకాన్ని దూరం చేస్తుంది.

### ఇమ్యూనిటీ



మునగాకుల్లో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఇమ్యూన్ సిస్టమ్ బూస్ట్ అవుతుంది. ఇందులోని యాంటీ మైక్రోబయల్ గుణాల కారణంగా ఇన్ఫెక్షన్స్ దూరమై సీజన్ చేంజ్ అయినప్పుడు వచ్చే సీజనల్ ప్రాబ్లమ్స్ని దూరం చేస్తాయి. జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సమస్యల్ని దూరం చేస్తుంది.

### ఎలా తయారుచేయాలి



ఈ టీ తయారుచేసేందుకు మనం కొన్ని తాజా మునగ ఆకుల్ని తీసుకుని నీటిలో వేసి మరిగించాలి. 4 నుంచి 5 నిమిషాల పాటు మరిగిన తర్వాత ఆ నీటిని తాగాలి. దీనికోసం మీరు ఎండిన మునగాకుల్ని కూడా తీసుకోవచ్చు. లేదంటే మునగాకు పొడినైనా వాడొచ్చు.

